క్లుప్తంగా

వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

కేసరపల్లి(గన్నవరం): రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడిని నివారించేందుకు ముందస్తు చర్యలు చేపట్టినట్లు కేసరపల్లి గ్రామ సర్పంచి చేబ్రోలు లక్ష్మీమౌనిక తెలిపారు. కేసరపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని స్థానిక సగర్లపేటలో రూ.4 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేస్తున్న బోర్‌వెల్, పైపులైన్ పనులను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ కేసరపల్లితో పాటు శివారు గ్రామాల్లో తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. పెరిగిన గృహ అవసరాలకు అనుగుణంగా కొత్తగా బోర్‌వెల్స్‌తో పాటు పైపులైన్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కాలనీ పెద్దలు గడ్డం అంకాలు, పలువురు కాలనీవాసులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

ఉంగుటూరు: బాలిక అదృశ్యంపై ఆత్కూరు పోలీస్ స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. ఎస్‌ఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం జి.కొండూరు గ్రామానికి చెందిన సుఖభోగి శ్రావణి ఈ నెల 9న గన్నవరం మండలం వీరపనేని గూడెంలోని తన స్నేహితురాలి ఇంటికి వచ్చింది. స్నేహితురాలి ఇంటిలో కుటుంబ సభ్యుల మధ్య చిన్నపాటి సమస్య రావడంతో దానికి కారణం శ్రావణి అని భావించి స్నేహితురాలి తల్లి అనసూయ శ్రావణిని మందలించింది. దీంతో ఆందోళన చెందిన శ్రావణి అదేరోజు రాత్రి 9గంటలకు స్నేహితురాలి ఇంటి నుంచి వెళ్లిపోయింది. శ్రావణి తన తల్లిదండ్రుల వద్దకు వెళ్లి ఉంటుందని అనుసూయ శ్రావణి తల్లిదండ్రులకు ఫోన్ చేసి వాకబు చేస్తే ఆమె అక్కడకు వెళ్లలేదని తెలిసి పరిసర ప్రాంతాల్లో విచారించారు. ఆచూకీ తెలియకపోవడంతో ఆత్కూరు పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. కేసు నమోదు చేసిన ఎస్‌ఐ దర్యాప్తు చేపట్టారు. బాలిక ఇంటి నుంచి వెళ్లినప్పుడు నీలి రంగు చుడీదార్, తెలుపు రంగు లెగ్గిన్ ధరించి ఉంది. ఆచూకీ తెలిసినవారు ఆత్కూర్ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ ఫోన్ నంబర్లు 94911 52837, 94914 91311కు తెలియజేయాలని కోరారు.

ఆలయ భూముల కౌలు వేలం

పెనమలూరు: తాడిగడప, పెదపులిపాక గ్రామాల్లో ఆలయ భూముల కౌలు వేలంపాట శనివారం ప్రశాంతంగా జరిగిందని ఈవో సుబ్బారెడ్డి తెలిపారు. ఆయన వివరాలు తెలుపుతూ పెదపులిపాక శ్రీచెన్నమల్లేశ్వరస్వామివారి దేవస్థానానికి చెందిన 3.77 ఎకరాల భూమికి 3 సంవత్సరాలకు కౌలు వేలంపాట ఉదయం 11 గంటలకు ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. కుర్రా కొండయ్య ఏడాదికి రూ.87వేలకు కౌలు వేలంపాట పాడారు. గతంలో ఈ భూమికి కౌలు వేలం పాట ఏడాదికి రూ.83 వేలకు పాట జరిగింది. తాడిగడప శ్రీసీతారామస్వామివారి దేవస్థానానికి చెందిన 4.94 ఎకరాల భూమికి కూడా కౌలు వేలం పాట ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. చలసాని రాధిక ఏడాదికి రూ.1,62,500 చొప్పున కౌలు వేలంపాట పాడారు.

విజయవంతంగా క్లిష్టమైన రీడోవాల్వ్ సర్జరీ



పెనమలూరు: పెనమలూరు మండలం పోరంకిలోని క్యాపిటల్ ఆస్పత్రిలో ఓ మహిళకు సంక్లిష్టమైన రీడోవాల్వ్ సర్జరీని విజయవంతంగా నిర్వహించినట్లు కన్సల్టెంట్ కార్డియో థొరాసిక్ సర్జన్ డాక్టర్ హేమకృష్ణసాయి తెలిపారు. ఈ మేరకు శనివారం ఆపరేషన్ వివరాలను ఆయన వెల్లడించారు. కృష్ణాజిల్లా ఘంటసాలకు చెందిన లక్ష్మికి 17 ఏళ్ల వయస్సులో గుండెకు సంబంధించి మొదటి వాల్వ్ రిపేర్ జరిగింది. ఆమెకు 28 ఏళ్ల వయస్సులో విజయవాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో రెండో వాల్వ్ రీప్లేస్‌మెంట్ ఆపరేషన్ చేశారు. ఇప్పుడు 39 ఏళ్ల వయస్సులో గుండె ప్రొస్థెటిక్ వాల్వ్ క్షీణత కారణంగా ఆమెకు తీవ్రంగా శ్వాస ఆడకపోవటం, ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తాయి. దీంతో మూడోసారి గుండె ఆపరేషన్ చేయటానికి వైద్యులు ముందుకు రాలేదు. ఆమె క్యాపిటల్ ఆస్పత్రిలో చేరగా రీడోమిట్రల్ వాల్వ్ రీప్లేస్‌మెంట్, ట్రైకస్పిడ్ వాల్వ్ రిపేర్‌ను విజయవంతంగా చేశారు. ఈ ఆపరేషన్ చాలా సంక్లిష్టమైందని, హైదరాబాద్ తదితర నగరాలకు వెళ్లకుండా తమ ఆస్పత్రిలోనే ఆపరేషన్ విజయవంతంగా చేశామని డాక్టర్ హేమకృష్ణసాయి తెలిపారు. కార్డియాలజిస్ట్ డాక్టర్ వీఎస్‌ఆర్ భూపాల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులకు న్యూట్రిషన్ ఫుడ్ పంపిణీ

గన్నవరం: స్థానిక బీసీ కమ్యూనిటీ హాలులో శనివారం రాష్ట్ర, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి సంయుక్త సహకారంతో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నిడమర్తి సౌజన్య చేతుల మీదుగా హెచ్‌ఐవీ బాధితులకు న్యూట్రిషన్ ఫుడ్ పంపిణీ చేశారు. అనంతరం లింక్ వర్కర్ స్కీమ్ జిల్లా రిసోర్స్ పర్సన్ మౌనిక హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులు తీసుకోవాల్సిన ఆహార, ఆరోగ్య జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. అనంతరం మోనిటరింగ్ అండ్ ఎవల్యూషన్ శ్రీనివాసరావు, జ్యోతి, కవిత నేతృత్వంలో హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులకు భోజన సదుపాయం కల్పించారు. హెచ్‌ఐవీ ప్రాజెక్ట్ ప్రతినిధి కృష్ణ, సూపర్‌వైజర్ రాకేష్, లింక్ వర్కర్ సదాలక్ష్మి పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్ల నిర్మాణానికి ఎన్‌హెచ్‌ఏఐ గ్రీన్‌సిగ్నల్



సర్వీస్ రోడ్ల కోసం స్థల పరిశీలన చేస్తున్న ఎన్‌హెచ్‌ఏఐ ఆర్‌ఓ, పీడీ

గన్నవరం: మండలంలోని మర్లపాలెం వద్ద జాతీయ రహదారి బైపాస్‌కు సర్వీస్ రోడ్ల ఏర్పాటుకు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్‌ఏఐ) ముందుకు వచ్చింది. మర్లపాలెంతో పాటు పరిసర గ్రామాల ప్రజల సౌకర్యార్థం బైపాస్ రోడ్డుకు ఇరువైపులా సర్వీస్ రోడ్లు నిర్మించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు గత కొంతకాలంగా ఆయా గ్రామస్తులు విన్నవించుకుంటున్నారు. ఎట్టకేలకు వీరి విజ్ఞప్తులపై స్పందించిన ఎన్‌హెచ్‌ఏఐ సర్వీస్ రోడ్ల ఏర్పాటుకు సానుకూలంగా స్పందించింది. ఈ మేరకు శనివారం ఎన్‌హెచ్‌ఏఐ రీజినల్ ఆఫీసర్ ఆర్‌కె.సింగ్ ఆ గ్రామానికి వచ్చి సర్వీస్ రోడ్ల నిర్మాణానికి సాధ్యాసాధ్యాలను పరిశీలించారు. రైల్వే ట్రాక్‌కు ఇరువైపులా జాతీయ రహదారి బైపాస్ రోడ్డుకు కనెక్టివిటీ అయ్యే విధంగా సర్వీస్ రోడ్డు నిర్మాణంపై స్థల పరిశీలన చేశారు. ప్రస్తుతం బైపాస్ రోడ్డు నిర్మాణం, రైల్వే ట్రాక్‌పై ఆర్వోబీ నిర్మాణానికి సంబంధించి మ్యాప్‌లను ఆయన పరిశీలించారు. గ్రామస్తులతో సుదీర్ఘంగా మాట్లాడిన సింగ్ వారి అభిప్రాయాలను కూడా సేకరించారు. సర్వీస్ రోడ్డు నిర్మాణం వల్ల మర్లపాలెంతో పాటు తెంపల్లి, వీరపనేనిగూడెంతో పాటు ఆ గ్రామంలోని ఏపీఐఐసీ పారిశ్రామికవాడకు మంచి కనెక్టివిటీ ఉంటుందన్నారు. దీనివల్ల ఈ ప్రాంతం పారిశ్రామిక అభివృద్ధి సాధించడంతో పాటు ప్రజలతో పాటు రైతులకు ఎంతో మేలు జరుగుతుందని గ్రామస్తులు వివరించారు. అయితే సర్వీస్ రోడ్ల నిర్మాణానికి మూడు ఎకరాల వరకు స్థల సేకరణ చేయాల్సి ఉంటుందని సింగ్ తెలిపారు. అవసరమైన భూములు ఇచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని గ్రామస్తులు కూడా అంగీకారం తెలిపారు. ప్రస్తుతం ఉన్న రైల్వేట్రాక్‌పై నుంచి సర్వీస్ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. భవిష్యత్‌లో రైల్వే అండర్ పాస్ నిర్మాణం ద్వారా సర్వీస్ రోడ్ల ద్వారా రాకపోకలు మరింత సులభతరమవుతాయన్నారు. సర్వీస్ రోడ్ల నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి కేంద్రానికి, ఎన్‌హెచ్‌ఏఐకు పంపనున్నట్లు ఆయన చెప్పారు. ప్రతిపాదనలు కార్యరూపం దాల్చిన తర్వాత నిర్మాణ పనులు త్వరితగతిన చేపట్టేందుకు అవసరమైన కార్యాచరణ చేపడతామని స్పష్టం చేశారు. ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్ట్ డైరెక్టర్ లత, పలువురు రీజినల్ అధికారులు, మెగా సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆధార్ నమోదు నిబంధనలు సడలించాలి

విజయవాడరూరల్: ఆధార్ నమోదుకు సంబంధించి నిబంధనలు సడలించాలని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. ఇంతకు ముందు ఆయా పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల పుట్టిన తేదీని ధ్రువీకరించిన సర్టిఫికెట్‌ను ఆధారంగా చేసుకొని ఆధార్ కేంద్రాల్లో ఆధార్ నమోదు ప్రక్రియ జరిగేది. ప్రస్తుతం ఆధార్ నమోదుకు తప్పనిసరిగా పుట్టిన తేదీ సర్టిఫికెట్ లేకపోతే అడ్వకేట్ నుంచి అఫిడవిట్ చేసుకుని రావాలనే నిబంధన పెట్టారు. దీంతో నిరక్షరాస్యులైన తల్లిదండ్రులు దాని అవసరతను గుర్తించక ఆధార్ నమోదు చేయడం లేదు. అఫిడవిట్‌కు ఫీజు చెల్లించాల్సి రావడంతో వారు ఆసక్తి చూపడం లేదు. దీంతో పాఠశాలలకు విద్యార్థులు వెళుతున్నా వారికి అటెండెన్స్ మాత్రం వేయలేని పరిస్థితి నెలకొందని ప్రధానోపాధ్యాయులు అంటున్నారు. అలాంటి విద్యార్థులకు ప్రభుత్వం అందజేసే యూనిఫామ్ దుస్తులు, పుస్తకాలు, బూట్లు, మధ్యాహ్న భోజన పథకం లాంటివి వర్తించడం లేదని చెబుతున్నారు. నున్న గ్రామంలోని పడమర ఎలిమెంటరీ పాఠశాలలో 102 మంది విద్యార్థులు చదువుతుండగా వారిలో ఏడుగురు విద్యార్థులకు ఆధార్ నమోదు కాకపోవడంతో వారికి అటెండెన్స్ పడటం లేదని హెచ్‌ఎం.భారతి తెలియజేశారు. ఈ విధంగా పలు పాఠశాలల్లో అనేక మంది విద్యార్థులున్నారని, ఈ సమస్యను గుర్తించి విద్యాశాఖ అధికారులు ఆధార్ నమోదుకు నిబంధనలు సడలించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

జాబ్ మేళాలో 115 మంది ఉద్యోగాలకు ఎంపిక

ఉయ్యూరు: సిద్ధార్థ అకాడమీ, విజయవాడ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏజీ అండ్ ఎస్‌జీ సిద్ధార్థ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశాలతో నైపుణ్యాభివృద్ధి శిక్షణ శాఖ ఆధ్వర్యంలో శనివారం జాబ్ మేళా నిర్వహించారు. హెటిరో ల్యాబ్స్ లిమిటెడ్, ముత్తూట్ ఫైనాన్స్, కురాకు ఫైనాన్షియల్ సర్వీసెస్, టెక్నోటాస్క్ బిజినెస్ సొల్యూషన్స్ ఇతర ప్రముఖ కంపెనీలు నిరుద్యోగ యువతకు ఇంటర్వ్యూలు నిర్వహించాయి. 229 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరుకాగా, 115 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డాక్టర్ పి.నరేష్‌కుమార్, ఉపాధి శిక్షణాధికారి ఏఎస్ శ్రీనివాసరావు, డాక్టర్ వీఎస్‌వీ కిషోర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శివనాథ్, ప్రత్యేక అధికారి కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు

పెనమలూరు: ఆస్తి ధ్వంసం చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని ఇద్దరు వ్యక్తులపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం గంగూరులో ఎర్నేని జానకిరామయ్య ఎస్టేట్‌లో కిలారు దిలీప్ వద్ద జువ్వ ఎల్లయ్యచౌదరి మేనేజర్‌గా పని చేస్తున్నారు. అయితే ఆస్తి తగాదాల కారణంగా గత నెలలో పలుసార్లు కందిమళ్ల భాస్కర్, కందిమళ్ల శ్రీరాజరాజేశ్వరి కొందరు వ్యక్తులను తీసుకు వచ్చి ఆస్తి ధ్వంసం చేసి, అద్దెకు ఉంటున్న వారిని బెదిరించారని ఎల్లయ్యచౌదరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత ఏడాదిన్నరగా ఈ విధంగానే బెదిరించి దౌర్జన్యానికి దిగుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ముస్తాబాదలో స్వచ్ఛ ర్యాలీ

గన్నవరంరూరల్: మండలంలోని ముస్తాబాద ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం జరిగింది. సర్పంచ్ వి.రాధాకృష్ణ కార్యక్రమం ప్రారంభించారు. పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా కృషి చేయాలన్నారు. డాక్టర్ శ్రీహర్ష మాట్లాడుతూ ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్ జెట్టి నానారావు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



పెనమలూరు జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులతో ప్రమాణం చేయిస్తున్న ఎమ్మెల్యే బోడెప్రసాద్



కంకిపాడులో ప్లకార్డులతో ప్రదర్శనలో పాల్గొన్న జిల్లా పంచాయతీ అధికారి డాక్టర్ జె.అరుణ

ఎమ్మెల్యే బోడెప్రసాద్

పెనమలూరు: పర్యావరణ పరిరక్షణకు సమష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులతో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బండి ప్రణవి, మండల వైద్యాధికారి సాయిలలిత, సర్పంచి లింగాల భాస్కరరావు, టీడీపీ నేతలు మారుపూడి ధనకోటేశ్వరరావు, కోయా ఆనంద్‌ప్రసాద్, కిలారు శివకుమార్, సంగెపు రంగారావు, విద్యార్థులు పాల్గొన్నారు. పెనమలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, సిబ్బంది స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఆస్పత్రి ప్రాంగణం శుభ్రం చేయించి మొక్కలు నాటారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి సాయిలలిత, డాక్టర్ అనూష, సీహెచ్ వో లక్ష్మయ్య, పీహెచ్‌ఎన్ లక్ష్మి, సూపర్‌వైజర్ ఉండి పురుషోత్తమరాజు పాల్గొన్నారు. తాడిగడప మున్సిపాలిటీలో కమిషనర్ భవానీప్రసాద్ స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులతో ర్యాలీ నిర్వహించారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ఎస్‌ఎస్‌ఎస్ వలంటీర్లు స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజారోగ్యం

కంకిపాడు: పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజారోగ్యం సాధ్యమవుతుందని జిల్లా పంచాయతీ అధికారి డాక్టర్ జె.అరుణ అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం అధికారులు, పట్టణ ప్రజలు పరిసరాలను పరిశుభ్రం చేసి, వ్యర్థాలను తొలగించారు. తడిచెత్త, పొడిచెత్తపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ప్రధాన సెంటరులో మానవహారం నిర్వహించి పరిసరాల పరిశుభ్రతపై నినదించారు. ప్రధాన సెంటరులో పలు



ఉయ్యూరులో ప్లాస్టిక్ వినియోగించవద్దని సూచిస్తున్న ఆర్డీఓ హెలా షారోన్

చోట్ల మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ బాకీ రమణ, ఉపసర్పంచ్ రాచూరి చిరంజీవి, తహసీల్దార్ వి.భావనారాయణ, ఎంపీడీఓ పి.అనూష, పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కంకిపాడు మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాల ప్రాంగణాల్లో స్వచ్ఛ ఆంధ్ర -స్వచ్ఛ దివస్ చేపట్టి పరిసరాలను శుభ్రం చేశారు.

పరిసరాల పరిశుభ్రత సామాజిక బాధ్యత

ఉయ్యూరు: పరిసరాల పరిశుభ్రత సామాజిక బాధ్యత అని ఉయ్యూరు ఆర్‌డీఓ హెలా షారోన్ అన్నారు. స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఉయ్యూరు ఆర్‌డీఓ కార్యాలయ ప్రాంగణంలో పరిసరాలను పరిశుభ్రం చేసి మొక్కలు నాటారు. యార్డు ప్రాంగణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కూరగాయల దుకాణాలను సందర్శించి ప్లాస్టిక్ వాడొద్దని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, ఏఓ భద్రునాయక్ పాల్గొన్నారు. పట్టణంలోని కాటూరు రోడ్డులో ఎంకే ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులతో కలిసి మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, కమిషనర్ వెంకటేశ్వరరావు, పాఠశాల డైరెక్టర్ ఎంకే బాబు, సిబ్బంది మానవహారం నిర్వహించారు.



దావాజీగూడెంలో జూట్ బ్యాగ్‌లను పంపిణీ చేస్తున్న సర్పంచ్, ఈఓ



కేసరపల్లిలో రోడ్లను శుభ్రం చేస్తున్న సర్పంచ్

ఎఫ్‌ఏను నియమించండి

ఉంగుటూరు: అవినీతి అక్రమాలకు పాల్పడిన ఉపాధి హామీ(ఎఫ్‌ఏ)ను తొలగించి ఆ స్థానంలో కొత్తవారిని నియమించడానికి ఇంకా ఎంతకాలం తీసుకుంటారంటూ గారపాడు గ్రామ సర్పంచ్ కొడాలి సుకన్య అధికారులను నిలదీశారు. అధికారుల అలసత్వంతో గ్రామంలో పేదలు ఉపాధి హామీ పథకంలో పనులు సరిగా చేయలేక అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ వడ్లమూడి సరోజిని అధ్యక్షతన శనివారం జరిగింది. సమావేశంలో గారపాడు సర్పంచ్ సుకన్య మాట్లాడుతూ గతంలో తమ గ్రామంలో ఎఫ్‌ఏగా పని చేసిన ఎం.ప్రమీల పనికి రాని వారికి హాజరు వేసి లక్షలాది రూపాయల అవినీతి, అక్రమాలకు పాల్పడడంతో రెండున్నర ఏళ్ల క్రితం ఆమెను తొలగించిన అధికారులు మళ్లీ ఆమె భర్తను ఎఫ్‌ఏగా నియమించి పనులు చేయించడం ఏంటని ప్రశ్నించారు. దీనిపై గ్రామస్తులు అనేక సార్లు అధికార యంత్రాంగాన్ని కలసి విన్నవించగా ఎప్పటికో ప్రమీల భర్తను కూడా తొలగించినా, ఆ స్థానంలో కొత్తవారిని ఎందుకు నియమించలేదని ఏపీవో టి.వినీలను ప్రశ్నించారు. గ్రామంలో ఓ యువకుడిని ఎఫ్‌ఏగా నియమించాలని గ్రామ పంచాయతీ తీర్మానం చేసి ఇచ్చినా అధికారులు పట్టించుకోకపోవడంపై విస్మయం వ్యక్తం చేశారు. అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారిపై అధికారులు ఎందుకంత ప్రేమ చూపుతున్నారో తెలపాలని అన్నారు. పలు గ్రామాల సర్పంచులు తమ గ్రామంలోని సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఆయా శాఖల అధికారులు వచ్చిన సమస్యలపై దృష్టి సారించాలని ఎంపీపీ సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో కె.జోగేశ్వరరావు, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

చెత్త సేకరణ యజ్ఞంలా చేపట్టండి

కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ పిలుపు



కలెక్టర్ బాలాజీ కి సమస్యలు తెలుపుతున్న స్థానికులు

ఉయ్యూరురూరల్: తడి చెత్త, పొడి చెత్త సేకరణ యజ్ఞంలా నిర్వహించాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పిలుపునిచ్చారు. మండలంలోని పెదఓగిరాల గ్రామంలో శనివారం నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా గ్రామంలోని ఇంటింటికీ తిరిగి ప్రజలకు తడి చెత్త, పొడి చెత్త, ఇతర వ్యర్థాలను సేకరించడంలో తీసుకుంటున్న జాగ్రత్తలపై ప్రత్యక్షంగా పరిశీలించారు. ప్రతి ఇంటి వద్ద నివాసితులను పిలిచి వారి ఇంటి నుంచి పంచాయతీ కార్మికులకు అందిస్తున్న తడి, పొడి చెత్త డబ్బాలను వ్యర్థాలను వ్యక్తిగతంగా చేతులకు గ్లౌజులు వేసుకుని పరిశీలించారు కొందరు తడి, పొడి చెత్తలను ఒకే డబ్బాలో వేసి ఉంచడంతో వాటిని ఎలా వేరు చేయాలో ఎందుకు ఏ కలర్ డబ్బాలు ఉచితంగా ప్రభుత్వం అందించిందో ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

కలెక్టర్‌కు సమస్యల ఏకరవు

స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పెదఓగిరాలకు విచ్చేసిన కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీకి స్థానికులు సమస్యలు ఏకరవు పెట్టారు. తమ గ్రామానికి శ్మశానవాటిక ఏర్పాటు చేయాలని కోరారు. గ్రామంలోని మురుగు బయటకు వెళ్లేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, ప్రధాన రహదారి వెంట డ్రైనేజీ సౌకర్యం కల్పించాలని, రహదారుల వెంట ఉన్న ఆక్రమణలను తొలగించి రహదారి విస్తరించాలని కోరారు. దళితవాడలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లకు మార్జిన్ ఏర్పాటు చేయకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వెంటనే మార్జిన్ ఏర్పాటు చేయించాలని కోరారు. గ్రామంలో పార్కును ఏర్పాటు చేయాలని కోరారు. గ్రామ పరిధిలో ఉన్న చెరువులను సొసైటీలకు ఇవ్వకుండా పంచాయతీ ఆదాయాన్ని మరింత పెంచేలా వెసులుబాటు కల్పించాలని విన్నవించారు. ప్రాధాన్యతాపరంగా సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని గ్రామస్తులకు కలెక్టర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఉన్న ఊర చెరువు దగ్గర మొక్కలు నాటారు. అనంతరం గ్రామంలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి, డివిజనల్ పంచాయతీ అధికారి జిల్లా హార్టికల్చర్ అధికారి మండల నోడల్ అధికారి జ్యోతి, తహసీల్దార్ సురేష్ కుమార్, ఎంపీడీవో శేషగిరిరావు, ఈఓఆర్డీ కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి కృపా కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వికాస్ విద్యార్థుల పారిశ్రామిక యాత్ర



బెంగుళూరులో ఐఐటి, ఇస్రో సంస్థల సందర్శనలో వికాస్ విద్యార్థులు

నున్న(విజయవాడరూరల్): విజ్ఞాన యాత్రలో భాగంగా నున్న వికాస్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు శనివారం బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ సంస్థను, ఇస్రో సంస్థను సందర్శించారు. బీటెక్‌లో సీఈసీ, ఈసీఈ, ఈఈఈ విభాగాలకు చెందిన 20 మంది విద్యార్థులు ఈ యాత్రలో పాల్గొన్నారు. ఆ సంస్థల్లోని వివిధ లాబొరేటరీలు, కంప్యూటర్ సెంటర్లను సందర్శించినట్లు కళాశాల డైరెక్టర్ ఎస్.కీర్తిరెడ్డి తెలియజేశారు. సూపర్ కంప్యూటర్, మిషన్ లెర్నింగ్, డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వంటి వాటిని రాకెట్లు, ఉపగ్రహాలలో ఏ విధంగా ఉపయోగిస్తున్నారనే విషయాలపై ప్రొఫెసర్స్ బాలస్వామి, శంకరమాడ స్వామి విద్యార్థులకు సోదాహరణంగా వివరించారని చెప్పారు. ఈ విజ్ఞాన యాత్రలో డీన్ సేవుక రాజన్, అధ్యాపకులు సాత్విక, తేజస్వి పాల్గొన్నారు. తమ విద్యార్థులకు ఇటువంటి సంస్థల్లో ఇంటర్న్‌షిప్ ఏర్పాటు చేస్తామని ప్రిన్సిపాల్ డాక్టర్ పరమేశ్వరరావు తెలియజేశారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి

రామవరప్పాడు: ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించి పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని ఎనికేపాడు సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు అన్నారు. రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు గ్రామాల్లో శనివారం 'స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమాలను నిర్వహించారు. ఆయా గ్రామాల్లో సర్పంచ్‌లు, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొని అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఎనికేపాడులో సర్పంచ్ పూర్ణతో పాటు పలువురు వార్డు, ఎంపీటీసీ సభ్యులు దుకాణాలు, షాపుల్లో ప్లాస్టిక్ కవర్లు వినియోగించవద్దని సూచించి జ్యూట్ బ్యాగ్‌లు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విద్యాధరరావు, ఎంపీటీసీ సభ్యుడు గంగుల శ్రీను, వార్డు సభ్యుడు రాచమళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకం నిషేధం ప్రజల కర్తవ్యం

ఉయ్యూరురూరల్: గండిగుంటలో మార్కెట్ యార్డ్ ప్రాంతంలోని ప్రజలకు, కూరగాయల మార్కెట్ వచ్చిన వినియోగదారులకు, వ్యాపారులకు ప్లాస్టిక్ వాడడం వల్ల వచ్చే నష్టాలపై అవగాహన కల్పించారు. ఏఓ బద్రు నాయక్, తహసీల్దార్ సురేష్ కుమార్, ఉయ్యూరు కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా భాష్యం బ్లూమ్స్ వార్షికోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఏపీ ఫైర్ సర్వీసెస్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ మురళీ మోహన్

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): కష్టపడే తత్వం నీ ఆయుధమైతే విజయం నీ సొంతం అవుతుందని ఏపీ ఫైర్ సర్వీసెస్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ డి.మురళీమోహన్ అన్నారు. పోరంకిలోని భాష్యం బ్లూమ్స్ స్కూల్‌లో శనివారం 3వ వార్షికోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి మురళీ మోహన్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. తల్లిదండ్రులు పిల్లల మనస్సు తెలుసుకుని నడుచుకుంటూ వారు ఏ రంగాల్లో ఆసక్తి కనబరుస్తున్నారో గ్రహించి వారిని ప్రోత్సహించాలని చెప్పారు. మరో అతిథిగా హాజరైన భాష్యం పూర్వ విద్యార్థి డాక్టర్ టి.శ్రీహరి మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలకు వెన్నుదన్నుగా నిలిచి వారిని అన్నివిధాలా ప్రోత్సహించాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యాసంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అతిథుల చేతులమీదుగా జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో భాష్యం ఐఐటీ ప్రోగ్రామర్ ఆనంద్ కుమార్, భాష్యం బ్లూమ్స్ జెడ్ఈఓ వరలక్ష్మి, భాష్యం విజయవాడ జెడ్ఓ జోషి, పోరంకి భాష్యం బ్లూమ్స్ ప్రిన్సిపాల్ మహాలక్ష్మితో పాటుగా ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్వచ్ఛతపై శిక్షణ భవిష్యత్‌కు రక్షణ

గన్నవరంరూరల్: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు నిర్వహించారు. వీరపనేనిగూడెం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో స్వచ్ఛత ప్రతిజ్ఞ, క్లాస్ రూమ్ శుభ్రం చేయటం, మొక్కలు నాటడం, ప్లాస్టిక్‌కు దూరంగా ఉండటం తదితర అంశాలు వివరించారు. సర్పంచ్ అరేపల్లి జేజమ్మ, ప్రిన్సిపాల్ వై.యశోదలక్ష్మి పాల్గొన్నారు. అనంతరం గ్రామస్తులకు అవగాహన కల్పిస్తూ గ్రామంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.

గ్రామాల్లో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమాలు

విజయవాడరూరల్: స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని పలు గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీలు చేశారు. పాతపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచి దేవగిరి సుజాత అధ్యక్షతన సమావేశం నిర్వహించి తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి పంచాయతీ సిబ్బందికి అందించాలని చెప్పారు. విద్యార్థులు, పంచాయతీ సిబ్బందితో స్వచ్ఛాంధ్ర పై ప్రతిజ్ఞ చేయించారు. నున్న గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సర్పంచి కాటూరి సరళ సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌ను వినియోగించవద్దని విజ్ఞప్తి చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి డి.శ్రీనివాసరావు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. వెస్ట్ ఎలిమెంటరీ స్కూల్ విద్యార్థులు ప్లాస్టిక్ ను వినియోగించవద్దని పలకలపై వ్రాసి ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. వీధిలో చెత్తను ఏరివేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు భారతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అంబాపురం గ్రామంలో పంచాయతీ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. పి.నైనవరం గ్రామంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై ర్యాలీ చేశారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత

గన్నవరం: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలు నిర్వహించారు. దావాజీగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ బడుగు మరియమ్మ, ఈఓ సరోజిని ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నియంత్రణ, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని ప్రతిజ్ఞ చేయించారు. పంచాయతీ కార్మికులు, సచివాలయ సిబ్బందికి జూట్ బ్యాగులను పంపిణీ చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.కేసరపల్లిలో సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీమౌనిక నేతృత్వంలో పాలకవర్గ సభ్యులు, పంచాయతీ సిబ్బంది రోడ్లను శుభ్రం చేశారు. అనంతరం దుకాణాలకు వెళ్లి ప్లాస్టిక్ నియంత్రించాలని కోరుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. వీకేఆర్ కళాశాల విద్యార్థులు రోడ్లను శుభ్రం చేశారు. గన్నవరంలో ప్లాస్టిక్ నియంత్రణపై ర్యాలీతో పాటు కరపత్రాలను పంపిణీ చేశారు. ఎంపీడీఓ టి.స్వర్ణలత, పంచాయతీ కార్యదర్శి చెన్నకేశవరావు తదితరులు పాల్గొన్నారు.